
రిజర్వాయర్ గట్టుపై పైకప్పు ఎగిరిపోయి తుప్పు పట్టిన షెల్టర్


రిజర్వాయరు గట్టుపై శిథిలమైన సీసీ రోడ్డు


పిచ్చి మొక్కల మధ్య తుప్పపట్టిన ఆట పరికరాలు

- అభివృద్ధికి ఆమడ దూరంలో ముడసర్లోవ పార్కు
- గతం ఘనం..నేడు అధ్వానం
- వనసమారాధనలకు నోచుకోని వైనం
- మూలకు చేరిన ఆట పరికరాలు
- పట్టించుకోని జీవీఎంసీ అధికారులు

మిథ్యావనం



విరిగిన ప్రహరీ గోడతో ముడసర్లోవ పార్కు ప్రధాన ద్వారం

ఆరిలోవ: నగరంలో ప్రశాంత వాతావరణంలో పర్యాటకులకు ఆహ్లాదాన్ని అందించే ముడసర్లోవ పార్కు జీవీఎంసీ అధికారులు నిర్లక్ష్యానికి గురవుతోంది. దీన్ని పట్టించుకొనే నాథుడే కరువయ్యాడు. ఒకప్పుడు ఉండే ఆహ్లాదం, అందాలు, సందర్శకులకు సౌకర్యాలు ఇప్పుడు కానరావడంలేదు. పార్కులో ఇప్పుడు అవన్నీ కనుమరుగై అస్తవ్యస్తంగా మారిపోయింది. రూ.కోట్లతో అభివృద్ధి చేస్తామంటూ కొన్నేళ్ల నుంచి అధికారులు ఊదరగొడుతున్నారు. కానీ వారి మాటలు ఇంతవరకు కార్యరూపందాల్చలేదు. దీంతో ఈ పార్కు శిథిలాస్థకు చేరింది. ఇందులో పిల్లలు కోసం ఏర్పాటు చేసిన ఆట పరికరాలు తుప్పపట్టిపోయాయి. దీంతో పిల్లలు పార్కుకు రావడం మానేశారు. పార్కు లోపల సందర్శకులు విశ్రాంతి తీసుకోవడానికి నిర్మించిన షెడ్‌లు శిథిలయ్యాయి. వాటి పైకప్పులు విరిగిపోయి, గచ్చులు ఊడిపోయాయి. పార్కులో ఉన్న రెండుచోట్ల వాటర్ ఫౌంటైన్లు మూలకు చేరాయి. దీంతో పాటు పార్కును ఆనుకొని ఉన్న రిజర్వాయరును చూడడానికి ఎత్తయిన గట్టుపై నిర్మించిన మెట్లు విరిగిపోయాయి. దీంతో వీటిపై నుంచి గట్టుమీదకు వెళ్లడానికి సందర్శకులు ఇబ్బందిపడుతున్నారు. ఈ గట్టుపై నుంచి నీటితో నిండిన రిజర్వాయరుతో పాటు చుట్టూ ఉన్న పచ్చని కంబాల కొండలు, సింహాచలం కొండలు తిలకించవచ్చు. అలాంటి గట్టు కూడా శిథిలమైనప్పటికీ అధికారులు పట్టించుకోకపోడం విశేషం. ఈ గట్టుపై సందర్శకుల సౌలభ్యం కోసం వేసిన సీసీ రోడ్డు శిథిలమైంది. నీటి వైపు నిర్మించిన రక్షణ గోడ పెచ్చులు ఊడిపోయి విరిగిపోతోంది. గట్టు మీద సందర్శకులు విశ్రాంతి తీసుకోవడానికి నిర్మించిన షెడ్ పైకప్పు ఎగిరిపోయి దాని ఇనుప రాడ్లు తుప్పుపట్టియాయి. ఇలా ఎక్కడ చూసినా అస్తవ్యస్తంగా పార్కు మారిపోయింది. హుద్‌హుద్ తుపాన్‌లో కూలిపోయిన పార్కు గోడను కూడా ఇంతవరకు నిర్మించకుండ వదిలేశారు.


శిథిలమైన రిజర్వాయరు గట్టు మెట్లు

ఒకప్పుడు పిక్నిక్‌లకు నిలయం


పార్కు లోపల శిథిలమైన విశ్రాంతి షెల్టర్లు

కార్తీక మాసంలో నగరవాసులకు పిక్నిక్‌లు జరుపుకోవడానికి ముందుగా ఈ పార్కే గుర్తుకు వచ్చేది. విశాలమైన బీఆర్‌టీఎస్ రోడ్డు పక్కన ఇది అందరికీ అందుబాటులో ఉంటుంది. దీంతో ఇక్కడ ఎక్కువమంది నగరవాసులు, కులాలు, సంఘాలు, యూనియన్లు, కుటుంబాలు వనభోజనాలు జరుపుకోవడానికి అనుకూలంగా ఉంటుంది. ఇక్కడ పెద్దలు అంతా ఓ చోట కూర్చొని ముచ్చట్లు చెప్పుకోవడానికి విశాలమైన పార్కు స్థలాలుండగా, పిల్లలు సరదాగా ఆడుకోవడానికి వివిధ రకాల ఆట పరికరాలుండేవి. ఇక్కడ రంగురంగుల నీటితో పైకి ఎగిసిపడే వాటర్ ఫౌంటైన్లు సందర్శకులను కనువిందు చేసేవి. చుట్టూ పచ్చని కొండలు, ప్రశాంతమైన వాతావరణం ఆహ్లాదం పంచేది. అధికారుల నిర్లక్ష్యంతో ఇప్పుడు అవేవీ కానరావంలేదు. పర్యాటకులకు ఆహ్లాదాన్ని అందించే ఈ పార్కుకు పూర్వ వైభవం తీసుకురావడానికి అధికారులు చర్యలు చేపట్టాలని స్థానికులు, పర్యాటకులు కోరుతున్నారు.

స్పందించిన కలెక్టర్

బడ్డీల తొలగింపు


బడ్డీ ఏర్పాటు చేయడానికి ఓ వ్యక్తి గెడ్డపై వేసిన ఇనుప చట్రాన్ని తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది

ఆరిలోవ: జీవీఎంసీ 13వ వార్డు పరిధి పైనాపిల్ కాలనీలో బీఆర్‌టీఎస్ పక్కన బడ్డీలను మంగళవారం రెవెన్యూ అధికారులు తొలగించారు. ఈ కాలనీలో మహిళా ప్రాంగణాన్ని ఆనుకొని బీఆర్‌టీఎస్ పక్కన ఫుట్‌పాత్‌లు, గెడ్డ అంచున కొందరు అనధికారికంగా బడ్డీలు ఏర్పాటు చేసి వ్యాపారం చేస్తున్నారు.

ఈ బడ్డీలు వద్ద రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో యువకులు గుంపులుగా చేరుతున్నారు. దీంతో మహిళా ప్రాంగణంలో చేతివృత్తుల్లో శిక్షణ పొందడానికి వెళ్లే మహిళలు, స్వధార్ గృహంలో ఆశ్రయం పొందుతున్న నిరాశ్రయ మహిళలు ఇబ్బందిపడుతున్నారు. అక్కడ బడ్డీల వద్ద గుంపులుగా ఉండే యువకుల్లో కొందరు మహిళలను ఇబ్బందిపెడుతున్నారంటూ సోమవారం మహిళా ప్రాంగణం అధికారులు గ్రీవెన్స్‌లో కలెక్టర్ హరేంద్ర ప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. అక్కడ బడ్డీలు నిర్వహించడం వల్లే తమకు సమస్య వస్తుందని, వారిపై చర్యలు తీసుకోవాలని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనికి స్పందించిన కలెక్టర్.. రూరల్ తహశీల్దారు పాల్‌కిరణ్‌కు ఫోన్‌చేసి వెంటనే బడ్డీలు తొలగించాలని ఆదేశించారు. దీంతో రెవెన్యూ అధికారులు మంగళవారం పైనాపిల్‌కాలనీ చేరుకొని సిబ్బందితో అక్కడ ఉన్న బడ్డీలను తొలగించారు. ఓ వ్యక్తి బడ్డీ పెట్టేందుకు గెడ్డపై అమర్చిన ఇనుప చట్రాన్ని సైతం తొలగించారు.

క్లుప్తంగా

ఫుట్‌పాత్‌లు శుభ్రం



ముడసర్లోవ వద్ద ఫుట్‌పాత్‌పై తొలగించిన పిచ్చి మొక్కలు

ఆరిలోవ: బీఆర్‌టీఎస్ రోడ్డు ఇరుపక్కలా ఫుట్‌పాత్‌లను పారిశుధ్య సిబ్బంది శుభ్రం చేస్తున్నారు. ముడసర్లోవ పార్కు నుంచి రామకృష్ణాపురం, శ్రీకృష్ణాపురం, పైనాపిల్‌కాలనీ వరకు బీఆర్‌టీఎస్‌కు ఇరుపక్కలా ఉన్న ఫుట్‌పాత్‌లు పిచ్చి మొక్కలతో నిండిపోయాయి. దీంతో వాకర్స్ ఇబ్బంది పడేవారు. దీనిపై గత నెల 25న 'ఫుట్‌పాత్‌లపై పిచ్చి మొక్కలు' శీర్షికతో సాక్షిలో వెలువడిన కథనానికి శానిటరీ అధికారులు స్పందించారు. దీంతో రెండు రోజులుగా ఫుట్‌పాత్‌లను సిబ్బందితో శుభ్రం చేయిస్తున్నారు. ఫుట్‌పాత్‌లపై మొక్కలు తొలిగిస్తున్నారు. మంగళవారం ముడసర్లోవ పార్కు నుంచి రామకృష్ణాపురం వరకు పిచ్చి మొక్కలు తొలగించి ఫుట్‌పాత్ శుభ్రం చేశారు.

పేదలకు పండ్లు, ఆహార ప్యాకెట్లు పంపిణీ


పేదలకు ఆహార ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న శివరామకృష్ణ, మార్కండేయులు

ఎంవీపీకాలనీ: విజయలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం పేదలకు పండ్లు, ఆహార ప్యాకెట్లు పంపిణీ చేశారు. ట్రస్ట్ ప్రతినిధులు బోని శివరామకృష్ణ, దేవరకొండ మార్కండేయులు తదితరులు ఎంవీపీ కాలనీ, మద్దిలపాలెం, బీచ్‌రోడ్డు, సిరిపురంతో పాటు పలు ప్రాంతాల్లో పేదలకు, భిక్షాటన చేసే వారికి ఈ ఆహార పదార్థాలు, పండ్లు అందజేశారు. కార్యక్రమంలో పలువురు ట్రస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

మంత్రి దృష్టికి ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు


మంత్రి రాంప్రసాద్‌కు వినతి అందిస్తున్న ఎన్ఎంయూఏ నాయకులు

మద్దిలపాలెం: ప్రజా రవాణాశాఖ ఉద్యోగులు సమస్యల పరిష్కారించాలని కోరుతూ రాష్ట్ర రవాణా, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డికి వినతి పత్రం అందజేశామని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు తెలిపారు. రాష్ట్ర సెక్రటేరియట్లో మంగళవారం మంత్రి చాంబర్లో కలిసి వినతిపత్రం ఇచ్చామన్నారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలన్నారు. త్వరలోనే సమస్యలు పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారని శ్రీనివాసరావు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో రాష్ట్ర అధ్యక్షులు పీవీ రమణారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస రాజు, రాష్ట్ర కోశాధికారి పీవీ మోహన్ పాల్గొన్నారు.

నాలుగు కిలోల గంజాయి పట్టివేత

సీతమ్మధార : గంజాయి తరలిస్తున్న వ్యక్తిని ఫోర్త్ టౌన్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. టాస్క్‌ఫోర్స్ పోలీసులు సోమవారం రాత్రి రైల్వేస్టేషన్ ఆవరణలో తనిఖీలు నిర్వహించగా ఒక వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించడంతో అతన్ని అదుపులోకి తీసుకుని విచారించారు. అతని వద్ద ఉన్న బ్యాగును సోదా చేయగా గంజాయి ఉన్నట్లు గుర్తించి ఫోర్తుటౌన్ పోలీసులకు అప్పగించారు. పోలీసులు విచారించగా గుంటూరుకు చెందిన ఎస్.కె. ఇసుబ్ (21)గా అతన్ని గుర్తించారు. అతని వద్ద నుంచి నాలుగు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. సీఐ ఎస్.విజయకుమార్ ఆదేశాల మేరకు ఎస్ఐ జి.వెంకటరావు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

ఇక్కడ ఇలా..అక్కడ అలా


శివాజీనగర్‌లో పగలు వెలుగుతున్న హైమాస్ట్ దీపాలు


భీమనగర్‌లో రాత్రులు వెలగని వీధి దీపం

ఆరిలోవ: జీవీఎంసీ పదమూడో వార్డులో పలుచోట్ల విద్యుత్ దీపాలు పరిస్థితి దిగజారింది. రాత్రులు వెలుగులు ఇవ్వాల్సిన విద్యుత్ దీపాలు కొన్నిచోట్ల పనిచేయడంలేదు. మరికొన్ని చోట్ల పట్టపగలే వెలుగులు ఇస్తున్నాయి. సాధారణంగా వీధి దీపాలు రాత్రులు వెలిగించాలి. పగలు ఆపేయాలి. ఇక్కడ మాత్రం సీను రివర్స్‌లో ఉంది. వార్డు పరిధి శివాజీ నగర్, 40 గజాల కాలనీలో నాలుగు రోజులుగా పట్టపగలే వీధి దీపాలు నిరంతరం వెలుగుతున్నాయి. దాని పక్కనే భీమనగర్‌లో మాత్రం నెలరోజులకు పైగా రాత్రులు వీధి దీపాలు వెలగడంలేదు. విద్యుత్ విభాగం అధికారులు అవసరమైన రాత్రి సమయంలో దీపాలు వెలిగించకుండా అవసరం లేని పగటి సమయంలో వెలుగిస్తూ విద్యుత్‌ను వృథా చేస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భీమనగర్‌లో వీధి దీపాలు వెలిగించాలని కోరుతున్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో కేసులో పలువురికి జరిమానా

బీచ్‌రోడ్డు: ఇటీవలే కాలంలో మూడో పట్టణ పరిధిలోని ట్రాఫిక్ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్‌లో తనిఖీల్లో పట్టుకున్న వారికి జిల్లా కోర్టు జారిమానా, జైలు శిక్ష విధించింది. కోర్టుకు 9 మందిని హాజరుపర్చగా వారిలో 8 మందికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధించారు. ఒకరికి ఐదు రోజుల పాటు జైలు శిక్ష విధించారు.

అప్పన్న అన్నప్రసాదానికి విరాళం


విరాళం చెక్కును అందిస్తున్న దాత నరసింహకుమార్ కుటుంబ సభ్యులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి నగరంలోని ఎంవీపీ కాలనీకి చెందిన ఎం.నరసింహకుమార్ లక్షా 11 వేల 116 రూపాయల విరాళాన్ని అందించారు. సంబంధిత విరాళం మొత్తాన్ని చెక్కు రూపంలో సింహగిరి పైనున్న పీఆర్వో కార్యాలయంలోని డొనేషన్ కౌంటర్‌లో ప్రొటోకాల్ సీనియర్ అసిస్టెంట్ వి.సూర్యనారాయణకు ఇచ్చారు. దేవస్థానం తరఫున దాతకు ఆలయ అధికారులు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రం అందించారు.

దివ్యాంగులు అన్ని రంగాలలో అభివృద్ధి సాధించాలి

- అవకాశాలు అందిస్తే అవరోధాలు అధిగమిస్తారు
- ఏయూ వీసీ శశిభూషణరావు


వీసీ శశిభూషణరావును సత్కరిస్తున్న నిర్వాహకులు

విశాఖ విద్య: దివ్యాంగులు, విభిన్న ప్రతిభావంతులు అన్ని రంగాలలో అభివృద్ధి సాధించాలని ఆంధ్ర విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య జి.శశిభూషణరావు అన్నారు. మంగళవారం ఏయూ కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగం సమావేశ మందిరంలో ది సెంటర్ ఫర్ స్టడీ ఆఫ్ సోషల్ ఇంక్లూజన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రెండు రోజుల జాతీయ సదస్సు 'టు వర్డ్స్ ఇంక్లూషన్- ఎంపవరింగ్ పర్సన్స్ విత్ డిజేబులిటీస్ ఫర్ ఏ డెవలప్డ్ ఇండియా బై 2047' ను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ దివ్యాంగులకు అనుకూలంగా ఉండే విధంగా కార్యాలయాల నిర్మాణాలు జరగాలని సూచించారు. ఈ దిశగా ఆంధ్ర విశ్వవిద్యాలయం కృషి చేస్తోందని చెప్పారు. అవకాశాలను అందిస్తే దివ్యాంగులు అవరోధాలను అధిగమిస్తారని చెప్పారు. రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్ ధనంజయరావు మాట్లాడుతూ వికసితభారత్ సాకారం కావాలంటే దేశంలోని దివ్యాంగులు సైతం సాధారణ వ్యక్తులతో సమానంగా ప్రగతి సాధించే దిశగా ప్రోత్సహిస్తూ అవకాశాలను కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్రం సంచాలకులు డాక్టర్ పి.సుబ్బారావు మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం పురస్కరించుకొని ఈ సదస్సును వర్తమాన అంశంపై నిర్వహించడం జరిగిందని తెలిపారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (న్యూఢిల్లీ) జాయింట్ సెక్రెటరీ డాక్టర్ ఆర్.మనోజ్ కుమార్ కీలక ఉపన్యాసం ఇచ్చారు. విశాఖ జోన్ 1 ప్రాంతీయ ఉపాధి అధికారి టి.అనిల్ కుమార్ మాట్లాడుతూ దివ్యాంగులకు లభించే అవకాశాలను వివరించారు. జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ ఏ. రాణి తాను గ్రూప్–1అధికారిగా కావడానికి చేసిన ప్రయత్నాన్ని, ప్రయాణాన్ని వివరించారు. ఈ సందర్భంగా అతిథులను సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఏ.నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దివ్యాంగుల దినోత్సవం


పత్యేక అవసరాలు గల పిల్లలకు వీల్ చైర్ అందజేస్తున్న ఎంఈవో అనురాధ

ఆరిలోవ: జీవీఎంసీ పదో వార్డు పరిధి తోటగరువు ప్రాథమిక పాఠశాల భవిత కేంద్రంలో మంగళవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. ఇక్కడ భవిత కేంద్రంలో 20 మంది ప్రత్యేక అవసరాలు గల పిల్లలున్నారు. ఈ సందర్భంగా కేంద్రంలో పిల్లలకు పలు రకాల ఆటల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా చినగదిలి మండలం ఎంఈవో-2 పి.అనురాధ పాల్గొని పిల్లలకు బహుమతులు అందజేశారు. అనంతరం ఎస్ఎస్ఎస్ పంపిణీ చేసిన రెండు వీల్ చైర్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల పిల్లలు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను ఉపయోగించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.విశ్వనాథం, భవిత ఉపాధ్యాయులు మహాలక్ష్మి, ఎస్‌కే సలీమ, పాఠశాల ఉపాధ్యాయులు మహాలక్ష్మి, రమేష్, పద్మ, లక్ష్మణ్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో ఏయూ విద్యార్థిని ప్రతిభ


విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ నరసింహారావు

విశాఖ విద్య: కర్ణాటకలో జరిగిన జాతీయ స్థాయి ఫైన్ ఆర్ట్స్ పోటీల్లో ఆంధ్ర విశ్వవిద్యాలయం క్యాంపస్ కాలేజీలో బీఎఫ్ఏ మూడో సంవత్సరం చదువుతున్న తుమ్మపాల గీత ప్రతిభ చాటుకుంది. కామెల్ ఆర్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కన్నడ యూనివర్సిటీ సహకారంతో నవంబర్ 25 నుంచి 29 వరకు కర్ణాటక హోస్‌పేట హంపి హెరిటేజ్ అండ్ వైల్డర్‌నెస్ రిసార్ట్‌లో జాతీయ స్థాయిలో ఫైన్ ఆర్ట్స్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలకు దక్షిణ భారతదేశంలోని 80 ప్రసిద్ధ కళాశాలలు, విశ్వవిద్యాలయాల నుంచి ఎంపికైన 80 మంది పాల్గొని, చిత్రకళలో వారికి ఉన్న నైపుణ్యతను ప్రదర్శించారు. ఏయూ ఫైన్ ఆర్ట్స్ కాలేజీకి చెందిన టి.గీత 'హంపి హెరిటేజ్' నిర్మాణంపై పెయింటింగ్ వేశారు. గీత వేసిన పెయింటింగ్ అందరి ప్రశంసలు పొందింది. దీంతో జాతీయ స్థాయి పోటీల్లో ప్రశంసాపత్రం, జ్ఞాపికను అందుకున్నారు. దీనిని పురస్కరించుకొని మంగళవారం ఏయూ ఫైన్ ఆర్ట్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ డి. సింహాచలం,ఆర్ట్స్ అండ్ కామర్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎ. నరసింహారావులు సదరు విద్యార్థిని టి.గీతతో ఫ్యాకల్టీలుగా వ్యవహరించిన జేడీ రావు, తమ్మినేని, కె.మృదులను అభినందించారు.

వీఎంఆర్‌డీఏ పార్కులో పరికరాల ఏర్పాటు


ఏర్పాటు చేసిన ఆట వస్తువు


కొత్తగా ఏర్పాటు చేసిన ఊయల

ఏయూక్యాంపస్ : బీచ్‌రోడ్డులో ఉన్న వీఎంఆర్‌డీఏ పార్కులో నూతన ఆట వస్తువులు చిన్నారులకు అందుబాటులోకి వచ్చారు. ఇటీవల కాలంలో ఇక్కడ ఏర్పాటు చేసిన అట పరికరాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. స్థానికులు వినతి మేరకు స్పందించిన అధికారులు కొన్ని ఆట పరికారాలకు మరమ్మతులు చేయించగా, మరికొన్నింటిని నూతనంగా ఏర్పాటు చేశారు. గతంలో ఇక్కడ ఉన్న ఉయ్యాలలు గొలుసులు, సీటింగ్ దెబ్బతినడంతో వీటిని మార్పు చేశారు. అదే విధంగా కొత్తగా క్లైంబింగ్ వాల్ ఏర్పాటు చేశారు. చెక్కతో ఉండే ఆట వస్తువుల స్థానంలో ఇనుముతో ఏర్పాటు చేశారు. నీటితో తడవడం వలన చెక్కతో ఉన్న ఆట వస్తువులు పాడైపోతున్నాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని, స్టీలు, ఐరన్‌తో తయారు చేసిన ఆట వస్తువులను ఏర్పాటు చేస్తున్నారు. కొత్త ఊయలలు సైతం ఏర్పాటు చేశారు. పూర్తిస్థాయిలో మరికొన్ని ఆట వస్తువులు అందుబాటులోకి తీసుకొస్తే పార్కుకు పూర్వ వైభవం రానుంది.


క్లైంబింగ్ వాల్

'బుల్లయ్య'కు ఫుట్‌బాల్‌లో తృతీయ స్థానం


ఫుట్‌బాల్ విజేతలతో కరస్పాండెంట్ మధుకుమార్

సీతంపేట: ఆంధ్రా యూనివర్సిటీలో ఈ నెల 1, 2 తేదీల్లో నిర్వహించిన అంతర్ కళాశాలల ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో బుల్లయ్య కళాశాల విద్యార్థులు తృతీయ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా ఫుట్‌బాల్ జట్టుకు నాయకత్వం వహించిన బీఎస్సీ ద్వితీయ సంవత్సరం విద్యార్థి నవీన్‌కుమార్‌ను, జట్టు సభ్యులను కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ జి. మధుకుమార్ అభినందించారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జి.ఎస్.కె.చక్రవర్తి, వైస్ ప్రిన్సిపాల్ ఆర్.శ్రీకాంత్, ఫిజికల్ డైరెక్టర్ బి.ఆర్.ఎస్. లక్ష్మణరెడ్డి, యు. గంగాభవానీ తదితరులు పాల్గొన్నారు.

ఐడియాథాన్ నిర్వాహకులను అభినందించిన రిజిస్ట్రార్


ప్రతిభ చూపిన విద్యార్థులతో రిజిస్ట్రార్ ధనుంజయరావు

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థులు ఇటీవల ఐడియాథాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎకో ఇనోవేటిక్స్ పేరుతో విద్యార్థులకు నిర్వహించిన ఈ పోటీలో ఏయూలో వివిధ భాగాలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని పర్యావరణహితంగా నిలిచే వివిధ సాంకేతికతలు, పరికరాలను అభివృద్ధి చేసేదిగా పనిచేశారు. మొదటి స్థానంలో నిలిచిన వారికి రూ.5 వేలు, రెండో స్థానంలో వారికి రూ. 2,500లు, మూడో స్థానంలో నిలిచిన వారికి రూ.1000 పురస్కారాన్ని, ప్రశంసా పత్రాన్ని అందించారు. నూతన ఆలోచనలను ప్రోత్సహించే విధంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన నిర్వాహకులను రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్ ధనంజయరావు ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఇందిర, కుసుమ అపర్ణ, ముదాసిర్, సబిహ తదితరులు పాల్గొన్నారు .

కాలువల ఆక్రమణ


వెటర్నరీ కాలనీలో కాలువను ఆక్రమించి నిర్మాణం

ఆరిలోవ: జీవీఎంసీ తొమ్మిదో వార్డు పరిధిలో కాలువలు ఆక్రమణకు గురవుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో మట్టి పేరుకుపోతుండగా.. మరో పక్క ఇళ్లముందు కాలువలను పూర్తిగా ఆక్రమించి నిర్మాణాలు సాగిస్తున్నారు.. వార్డులో వెటర్నరీ కాలనీలో ఇటీవల పెద్ద భవనాల నిర్మాణాలు చేపట్టారు. ఇంకొన్ని నిర్మాణాలు జరుగుతున్నాయి. ప్రధాన రహదారులను ఆనుకొని చేపట్టిన నిర్మాణాలు ముందు కాలువలపై శ్లాబులు వేశారు. దీంతో రోడ్డు పక్కన కాలువలు కానరావడంలేదు. వర్షం పడినప్పుడు ఇళ్ల నుంచి వచ్చిన నీరు కాలువలోకి చేరడానికి వీలుపడటంలేదు. దీంతో ఆ నీరు నేరుగా రోడ్డుమీదకే ప్రవహిస్తోంది. దీనివల్ల చిన్నపాటి వర్షానికి సైతం ఇక్కడ రోడ్లు బురదమయమవుతున్నాయి. వర్షం కురిసే సమయంలో ఇక్కడ రహదారిపై వాహనచోదకులు ప్రయాణించలేని పరిస్థితి ఏర్పడుతుంది. దీంతో పాటు శ్లాబులు కింద ఉన్న కాలువల్లో పేరుకుపోయిన పూడికను సైతం పారిశుధ్య కార్మికులు తొలగించలేని పరిస్థితి నెలకొంది. ఆ శ్లాబులు తొలగించాల్సి ఉండగా.. జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు పట్టించుకోవడంలేదు.